

అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కులగణన అంశంపై రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మంగళవారం ఓ ప్రకటనలో జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. నవంబర్ 17 వ తేదీన రాజమహేంద్రవరంలోని మంజీర హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు మీడియాలో వచ్చిన వార్తల ద్వారా తెలుసుకున్నామని తెలిపారు. సమావేశం నిర్వహించడాన్ని సిపిఎం స్వాగతిస్తున్నదని, అయితే ఆ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలను మాత్రమే ఆహ్వానం ఉన్నట్టు తెలిసిందన్నారు. రాష్ట్రంలో చాలా ముఖ్యమైన రాజకీయ అంశంపై జరిగే ఇటువంటి రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పాల్గొని సిపిఎం నుంచి కొన్ని సూచనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అరుణ్ తెలిపారు.

సర్పంచులకు దక్కని గౌరవం

▸ జిల్లా వ్యాప్తంగా 6 నెలలుగా బకాయిలు ▸ మనోవేదనతోనే కాలం గడుపుతున్న సర్పంచ్‌లు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం పాలనలో తమకు 'గౌరవం' దూరమైందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమతో పోల్చితే వాలంటీర్ల పరిస్థితే కొంత మేలని వాపోతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో వాలంటీర్లకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.5 వేలు గౌరవ వేతనం ఇస్తున్న విషయం విధితమే. జిల్లావ్యాప్తంగా 366 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 6 నెలలుగా గౌరవ వేతన బకాయిలు ఉన్నట్లు సర్పంచ్‌లు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక్కొక్క సర్పంచ్‌కు రూ.18,000 చొప్పున అక్షరాలా రూ.65.88 లక్షలు బకాయిలు ఉన్నట్లు సమాచారం. 90 శాతం గ్రామ పంచాయతీల్లో వైసిపి మద్దతుదారులే సర్పంచ్‌లుగా కొనసాగుతున్నారు. జిల్లాలో సర్పంచ్ ఎన్నికలు జరిగి 30 నెలలు కాగా ప్రారంభంలో నాలుగైదు నెలలకు మాత్రమే గౌరవ వేతనం ఇచ్చింది. ఇక రెండేళ్ల నుంచి గౌరవ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ వస్తోంది. పల్లెల్లో పరపతి కోసం సర్పంచ్‌లుగా ఎన్నికై నాటి నుంచి స్థానికంగా ఏదో చేద్దామని కలలు కన్నారు. గ్రామ పంచాయతీల్లో ఉన్న నిధులు తాము అనుకున్న విధంగా ఖర్చు చేయవచ్చన్న ఉద్దేశంతో సొంత ఖర్చులతో పలు రకాల పనులు చేశారు. అలా పనులు చేస్తున్న క్రమంలోనే ప్రభుత్వం షాక్ ఇచ్చింది. పంచాయతీ అకౌంట్లలో ఉన్న నిధులను ప్రభుత్వం తమ అకౌంట్లలోకి జమ చేసుకోవటం ప్రారంభించింది. సర్పంచ్‌లుగా కొత్తగా వచ్చిన సమయం కదా అని మొదట్లో వదిలేశారు. రాను రాను కేంద్రప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులను కూడా ప్రభుత్వమే వాడేసుకుని పంచాయతీ అకౌంట్లను జీరో చేయటం పరిపాటిగా మారింది. పనులకు బిల్లులు రాక, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం(జీతం) కూడా ఇవ్వని దుస్థితి ఏర్పడింది. సర్పంచ్‌లకు ఏ నెలకానెల రూ.3 వేలు గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. గ్రామాల్లో నిరంతరం ప్రజలతో ఉండే సర్పంచ్‌లకు ఒక వైపు కనీస గౌరవం లేకుండా పోతుండగా ఇంకొక వైపు ప్రభుత్వం ఇవ్వాల్సిన గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. ప్రతి ఏటా రెండు సార్లు విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం సిఎఫ్ఎంఎస్ ఖాతా ద్వారా విద్యుత్ చార్జీలకు ఇతరాత్ర ఖర్చులకు దారి మళ్లిస్తోంది. మైనర్ పంచాయితీలలో అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణకు సైతం నిధులు లేక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరస్థితుల్లో నెలల తరబడి గౌరవ వేతనాలు తీసుకోలేని పరిస్థితి నెలకుందని కొందరు వాపోతున్నారు. ఈ గౌరవ వేతనం కోసం సర్పంచ్‌ల సంఘం జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేకసార్లు ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోని పరిస్థితి వచ్చిందంటే సర్పంచ్‌ల మనో వేదన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

6 నెలలుగా గౌరవ వేతనాలు లేవు

రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు సక్రమంగా గౌరవ వేతనం విడుదల చేయటం లేదు. ఎన్నికలు జరిగిన నాటి నుంచి ప్రతి నెలా విడుదల చేసిన దాఖలాలు లేవు. 6 నెలలకోసారి వేతనాలు విడుదల చేస్తోంది. ప్రస్తుతం ఆరు నెలల బకాయిలు ఉన్నాయి. అక్షరాలా రూ.18,000 బకాయిలు ఉన్నాయి.

-చెక్కపల్లి మురళీకృష్ణ, సర్పంచ్, కడియపుసావరం, కడియం మండలం.



ఓటు నమోదుపై అవగాహన ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్ భరత్

తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజానగరం

అర్హత కల్గిన ప్రతీ ఒక్క యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత సూచించారు. మండలంలోని దివాన్‌చెరువు జాతీయ రహదారిపై మంగళవారం ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన ద్వారా ఓటు యొక్క విలువను అవగాహన కల్పించారు. ఓటు యొక్క ప్రాధాన్యతను గుర్తించాలంటూ స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రజాస్వామ్యలో ఓటు అనేది చాలా కీలకమని అన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కొరకు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చనిపోయిన వ్యక్తుల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించుకోవడం కోసం ఫారం 7, చిరునామా నియోజకవర్గల మార్పు కోసం ఫారం 8 ద్వారా ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్‌డిఒలు ఎ.చైత్ర వర్షిణి, ఎస్.మల్లి బాబు, తహశీల్దార్ పవన్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు మోడీ మరోసారి మోసం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



మాట్లాడుతున్న మాజీ ఎంపి హర్ష

తెలంగాణ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే ప్రధాని మోడీ మాదిగలను మరోసారి మోసం చేస్తున్నారని మాజీ ఎంపీ జివి.హర్ష కుమార్ ఆరోపించారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగల విశ్వరూపం మహాసభకు మోడీ హాజరయ్యి మాదిగల పక్షాన పోరాడతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వచ్చే శీతాకాల సమావేశంలో వర్గీకరణ బిల్లు పెట్టి మాదిగ, ఉపకులాలకు న్యాయం చేస్తామని ప్రకటిస్తారని మాదిగ సోదరులు అంతా ఎదురుచూశారని, అయితే ఎప్పటిలాగే కమిటీ వేస్తానని వారి ఆశలపై నీళ్లు చల్లారనానరు. తాము అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామన్న బిజేపి పాలకులకు 10 ఏళ్ళ సమయం చాలలేదా అని ప్రశ్నించారు. మోడీ ప్రకటనపై విరక్తి చెందిన మాదిగలు బిజేపిని ఓడించాలని తీర్మానం చేసుకున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్న నేపథ్యంలో ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్‌ల కొరకు పోరాడాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ రిజర్వేషన్‌లు ఎత్తివేస్తున్నారని ఆరోపించారు. ఎస్‌సి రిజర్వేషన్‌లు వర్గీకరణ చేయాలంటే కుల ప్రాతిపదిన కాకుండా, పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని వర్గీకరిస్తేనే నిజమైన అర్హులకు రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయన్నారు. ఎస్‌సిల్లో చైతన్యం తీసుకురావడం కోసం త్వరలో దళిత సింహగర్జన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

నేడు విజయవాడలో జరుగుతున్న సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకుడు ఎం.సుందరబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండు సెంటర్ నుంచి అల్లూరి విగ్రహం సెంటర్, మెరక వీధి సెంటర్లలో కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.దొరయ్య, మాణిక్ రెడ్డి, హరిబాబు, తిరుమల సూరిబాబు, కాళ్ళ శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు వరం జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - గోపాలపురం


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. మంగళవారం మండలంలోని వాదలకుంట గ్రామంలో సర్పంచ్ జొన్నకూటి మణమ్మ ఆధ్వర్యంలో జెఎఎస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయాలు వద్ద జెఎఎస్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయని తెలిపారు. సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేసి పిల్లలకు పెట్టి బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వి.సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, తహశీల్దార్ బి.రవీంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శులు రాఘవరెడ్డి, చిన్న వెంకాయమ్మ, జె.శ్రీనివాస్, బి.నాగరాజు, అన్సర్ భాష, ఇళ్ల శ్రీరామమూర్తి, తదితర నాయకులు, కార్యకర్తలు వైద్య సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - గోపాలపురం

సదరం సర్టిఫికెట్ కోసం గత రెండు రోజులుగా ఒక వృద్ధ వికలాంగురాలు స్థానిక పిహెచ్‌సి వద్ద ఎదురుచూపులు చూస్తోంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని కేసనపల్లి గ్రామానికి చెందిన ఉబ్బాని లక్ష్మి(70) 4 ఏళ్ల క్రితం బస్సు ప్రమా దంలో రెండు కాళ్లు కోల్పోయింది. భర్త మృతి చెందడంతో కుమార్తె దగ్గర జీవనం సాగిస్తోంది. ప్రస్తుతానికి ఆమెకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. సదరం సర్టిఫికెట్ కోసం ఆమె నెల రోజుల క్రితం సచివాలయంలో స్లాట్ బుక్ చేసుకుంది. సదరం ధ్రువీకరణ కొరకు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పిహెచ్‌సి ఎంపికైంది. ఈ నెల13వ తేదీన సోమవారం ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల సమయంలో డాక్టర్‌ను కలవాలని ఆన్‌లైన్‌లో ఆమెకు సమాచారం వచ్చింది. దీంతో ఆమెను తీసుకుని సోమవారం తెల్లవారుజామున కేసనపల్లి నుంచి అద్దె కారులో బయలుదేరి స్థానిక పిహెచ్‌సికి వచ్చారు. డాక్టర్లు ఎంతకీ రాక పోవడంతో ఆసుపత్రిలో ఉన్న సిబ్బందిని అడిగారు. సోమవారం శెలవని చావు కబురు చల్లగా చెప్పారు. సోమవారం నుంచి మంగళవారం సాయంత్రం వరకు సదరం ధ్రువీకరణ చేసే డాక్టర్ రాకపోవ డంతో వృద్ధురాలతో కుటుంబ సభ్యులు హాస్ప టల్ వద్ద పడిగాపులు కాశారు. మంగళవారం కూడా ఆ వృద్ధిరాలి సదరం దృవీకరణ చేయ కుండానే జెఎఎస్ కార్య క్రమానికి వైద్యుడు వెళ్లిపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతు న్నాయి. స్థానిక పాత్రికేయులు వైద్యుల దృష్టికి తీసుకెల్లడంతో మంగళవారం సాయంత్రం 5 గంటలకు సదరం పరీక్షలు పూర్తి చేస్తామని తెలిపారు.

కార్టూ'నిజం'



విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు

ప్రజాశక్తి - యంత్రాంగం



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న సర్పంచ్ వెంకట్రావు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో మంగళవారం ప్రారంభం అయ్యాయి. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రామ సర్పంచ్ మెండే వెంకట్రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.చంద్రప్రసాద్, రచయిత వి.సుందరావులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్, గ్రంథాలయ అధికారి జి.కృష్ణారావు పాల్గొన్నారు. **కడియం** శాఖా గ్రంథాలయంలో గొందేశీ పూర్ణ చంద్రా రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తీల్లపూడి సత్య నారాయణ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వి.లజపతిరాయ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ డి.శ్రీనివాస్, జై జవాన్ జై కిసాన్ అధ్యక్షులు సిహెచ్. ఈశ్వర్ రావు గ్రంథాలయ అధికారిణి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల సూచించారు. **కొవ్వూరు రూరల్** స్థానిక గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి, కమిషనర్ బి.శ్రీకాంత్ జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తోట ఉదయలక్ష్మి ప్రసన్న, పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** చాగల్లులో సర్పంచ్ ఉన్నమట్ల మనంశ్శాంతి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఎస్.అర్జునరావు, బి.విజయలక్ష్మీ, గ్రంథాలయ అధికారి గద్దే శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంఇఒ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. చంద్రవరం శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ ఎం.శ్రీరామ్ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాల్లో వైసిపి నాయకులు జి.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ గ్రంథాలయాధికారి కె.సుమన్ కుమార్ పాల్గొన్నారు. **పెరవలి** పెరవలి, ముక్కామల శాఖా గ్రంథాలయాల్లో సర్పంచ్‌లు గంగోలు సీతమ్మ, కేతా త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ కార్యదర్శి ఎం.బుల్లచ్చన్న, ఎంఇఒ బిఎస్.స్వరూప్, ఎడిపి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు ఆర్.ప్రమీల కుమారి, జి.రామకృష్ణ పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వారోత్సవాల్లో ఎంపిపి వి.సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత, తహశీల్దార్ రవీంద్రనాథ్, ఎంపిడిఒ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ శిరీష పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంబాబు, చిత్రంలో వనిత

రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలనకు మరోసారి రాష్ట్ర ప్రజలు అండగా నిలవాలని రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, తానేటి వనిత అన్నారు. మండలంలోని పెనకనమెట్ట గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, తానేటి వనితతోపాటు, ఎంపి మార్గాని భరత్ రామ్, ఎంఎల్‌ఎలు జి.శ్రీనివాస నాయుడు, జక్కంపూడి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ లక్ష్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. రాష్ట్రంలో 30 లక్షల మంది ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల సాకారం చేసే దిశలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందని అన్నారు. గత నాలుగున్నర సంవత్సర కాలంలో పేదల బ్యాంకు ఖాతాలో రూ.2,35,000 లక్షలను జమ చేశామన్నారు. ఇంటి వద్దకె సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. జనవరి నుంచి రూ.3 వేల చొప్పున సామాజిక భద్రత పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో 87 శాతం మంది ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం వెనుక ప్రజలు ఉంటారనే నమ్మకంతోనే తాము ముందుకు వస్తున్నామని తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం



కడియం నలంద స్కూల్లో విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న రమేష్

భారత దేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు మండాలల్లోని వివిధ ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో బాలల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. **బిక్కవోలు** కుంకుదురు ఉన్నత పాఠశాల ఆవరణలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు కె.శ్రీకృష్ణసాయి, పి.ఈశ్వరరె డ్డి, ఎం.ఎల్.రెడ్డి, కె.అప్పారావు పాల్గొన్నారు. **కడియం** బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శ్రీ నలంద స్కూల్లో బాలల దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక, క్విజ్ పోటీల్లో విజేతలకు సిఆర్‌పిఎఫ్ కన్వీనర్ డాక్టర్ రమేష్ నోట్ పుస్తకాలు, బహుమతులు అందచేశారు. అలాగే దుళ్ల ఎంపిపి నెం.1 పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో ఎంఇఒ వి.లజపతిరాయ్ పాల్గొని మాట్లాడారు. **చాగల్లు** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీర్రాజు, ఆర్‌వి. ప్రసాద్, వి.శ్రీనివాస్, విజయ లక్ష్మి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని తాడిపర్రు జివిఎస్‌ఆర్ జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, ఉండ్రాజవరం జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.విశ్వప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.వెంకటరత్నం, జి.తాతారావు, కె.రామప్రసాద్, ఐ.రాంబాబు, కె.ఐశ్వర్య, వివి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే బాలల దినోత్సవంను పురస్కరించుకుని ఎంఇఒ కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ జడ్‌పిటిసి కోమట్లపల్లి వెంకట సుబ్బారావు తనయుడు వివేక్ జ్ఞాపకార్థం ఉత్తమ విద్యార్థులకు నగదు, మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ 1 సిహెచ్ సక్సేనా రాజు, ఎంఇఒ 2 డి.శారదా జ్యోత్స్న పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక రాజా పబ్లిక్, శ్రీ రామ పబ్లిక్ పాఠశాలల్లో ఆయా పాఠశాల కరస్పాండెంట్లు పి.సూర్య ప్రకాశరావు, పి.రమ, విజయ రత్నంరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఎస్.రమణ, డి.చిన్నబాబు, ఎస్.వీరబాబు, వి.ప్రసాద్, పి.బుజ్జి, ఎస్ఐ శివ నాగబాబు పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక భాష్యం స్కూల్లో బాలల దినోత్సవంలో సాఫ్ మాజీ డైరెక్టర్, హెచ్‌ఎం పేరం రవీంద్ర నాథ్ పాల్గొని వివిధ క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్య నాయుడు, చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, ఉపాధ్యాయులుపాల్గొన్నారు. పల్లంట్ల గ్రామంలో జడ్‌పి హైస్కూల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల మానవత ఉపాధ్యక్షులు ఎ.సుభాష్ చంద్రబోస్, డైరెక్టర్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్ ఎందుకు మళ్లీ సిఎం కావాలి?

ప్రజాశక్తి - నల్లజర్ల

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న సిఎం జగన్ రెడ్డి ఎందుకు మరోసారి సిఎం కావాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నల్లజర్ల శివారులోని బ్రహ్మరాజు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ మాస్కు అడిగిన దళిత డాక్టర్ని చంపినందుకా? వరప్రసాద్‌ను స్టేషన్లోనే శిరోముండనం చేసినందుకా? దళిత బాలికను అత్యాచారం చేసి స్టేషన్ ముందు వదిలినందుకా? కంచికచర్లలో శ్యామ్ కుమార్ నోట్లో మూత్ర విసర్జన చేసినందుకా? దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసినందుకా? అని ప్రశ్నించారు. టిడిపి జాతీయ కార్యదర్శి కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా జైలు పక్షులా బెయిల్ పై బ్రతుకుతున్న జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే మద్దిపాటి వెంకటరాజును రానున్న ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, నక్క ఆనందబాబు, కెఎస్.జవహర్ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో... గడప గడపకూ...

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల కేంద్రం ఉండ్రాజవరంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అధికారుల సమక్షంలో ప్రతి ఇంటికి వెళ్లి, సక్రమంగా అందుతున్నది, లేనిది ప్రజలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల అవసరాలను గుర్తించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చాగల్లు విద్యార్థినికి కాంస్య పతకం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు జడ్‌పి హైస్కూల్ విద్యార్థినీ ఎస్.రోజా ప్రవళ్లిక అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో జరిగిన రాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్‌షిప్ అండర్ 14 విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు పిడి విజయలక్ష్మీ మంగళవారం తెలిపారు. ప్రవల్లికను శిక్షణనిచ్చిన పిఇటి ప్రేమ్‌చంద్‌ను పాఠశాల విద్యకమిటి, పాఠశాల హెచ్‌ఎం పి.వీర్రాజు, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం.మోజెస్ అభినందించారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో బస్టాండ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కృష్ణారావు మాట్లాడుతూ డిసెంబర్ 9 వరకు ఓటు నమోదు చేయుటకు అవకాశం ఉందని, అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ స్వామి నాయక్, ఆర్ఐ లక్ష్మి, విఆర్ఒలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల బోర్డు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గంగపాలెం గ్రామంలో సర్పంచ్ దొడ్డి లక్ష్మి ఆధ్వర్యంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల డిస్ప్లే బోర్డును వైసిపి నాయకులు సుంకర వీరబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కంటే అదనంగా అనేక సంక్షేమ పథకాలు అమలుపరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, ఎంపిటిసి సీతా దుర్గబాబు, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, ఇఒపిఆర్‌డి ఎం రాజేశ్వరరావు, పంచాయతి కార్యదర్శి గోవిందు, సచివాలయం సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అనవసరమైన విమర్శలు తగవని జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాలంగి గ్రామంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సంక్షేమ పథకాల పట్టిక ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్ పాలన కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పట్టిక ఏర్పాటు చేయడం సిఎంలోని ఆత్మస్థైర్యాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కఠారి సిద్ధార్థ రాజు, షేక్ షాజహాన్, నాగిరెడ్డి వెంకటేశ్వర్లు, వెలిచేటి జానకిరామయ్య, పాలాటి శరత్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో పారదర్శకత అవసరం : ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనలో పారదర్శకత అవసరమని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. టిడిపి బిసి విభాగం ఆధ్వర్యంలో బిసిలకు ప్రభుత్వం నమ్మకద్రోహంపై ఐక్య పోరాటం, కుల సంఘాలు, ప్రజాసంఘాలు అఖిల పక్షాలతో రౌండ్ టేబుల్ సమావేశం కాకినాడలోని సూర్యకళా మందిరంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐవి ఈ సందర్భంగా మాట్లాడారు. 1931 తర్వాత దేశంలో బిసి కుల గణన జరగలేదన్నారు. దేశానికి ఆదర్శంగా బీహార్ రాష్ట్రం తొలిసారిగా కుల గణన చేసి ఈ ఏడాది అక్టోబర్ 2న నివేదిక ప్రకటించడం అభినందనీయమన్నారు. అదే విధంగా రాష్ట్రంలోనూ జరగాలన్నారు. మోడీ ప్రభుత్వం మనువాద దక్పథంతో కుల గణనను వ్యతిరేకించడం అన్యాయమన్నారు. వ్యవస్థలో సమూలంగా మార్పులు చేయడం ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. నేటికీ సమాజంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు శ్రమ చేసే వర్గంగానే ఉన్నారన్నారు. కుల గణన ద్వారా రాజ్యాంగ పదవుల్లో విద్యా, ఉద్యోగాల్లో వీరికి సామాజిక న్యాయం అందాలన్నారు.



అఖిల పక్షాల రౌండు టేబుల్‌సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఐవి

ఏపీ రాజకీయాల్లో అధికారమంతా రెండు ఆధిపత్య కులాల చేతుల్లోనే నడుస్తుందన్నారు. బూర్జువా రాజకీయ పార్టీల్లో ఉన్నవాళ్లు ఆ పార్టీ తీసుకునే ప్రజా వ్యతిరేక విధానాలను ఎదుర్కోలేకపోతున్నారన్నారు. మంత్రులుగా ఉన్నా వాళ్ల చేతుల్లో నిర్ణయాధికారం ఉండడం లేదన్నారు. కొందరికే పదవులు దక్కిన ఆయా సామాజిక వర్గాల వారందరికీ మొత్తంగా మేలు జరగడం లేదన్నారు. అందువలన సామాజిక న్యాయం కోసం వ్యవస్థలో మార్పులు కోసం పోరాటాలని పిలుపునిచ్చారు. వైసిపి పాలనలో రాజకీయ విద్వేషాలు, లా అండ్ ఆర్డర్ తో ప్రజా ఉద్యమాలను అణచివేయడం తప్ప ఏమీ సాధించలేదన్నారు. ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా పలువురు బీసీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు మాట్లాడారు. జిల్లాకు చెందిన మంత్రి చెల్లుబోయిన వేణు బీసీలకు అండగా ఉండి ఆత్మగౌరవం నింపకపోగా వైసీపీ పెద్దల కాళ్లపై మోకరిల్లడాన్ని వారు తప్పుబట్టారు. బీసీలను తలదించుకునే స్థాయికి వేణు దిగజార్చారన్నారు. తొలుత నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే, మాజీ సిఎం ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి సర్వారపు రామారావు, టిడిపి నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, కాకినాడ రామారావు, పెంకే శ్రీనివాస్ బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, గుత్తుల రమణ, నురుకుర్తి వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు తాటిపాక మధు, సిపిఎం నాయకులు పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణను ప్రధాని సమర్థించడం విచారకరం

ప్రజాశక్తి- పిఠాపురం

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఎస్‌సి వర్గీకరణను సమర్థించడం విచారకరమని ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజు అన్నారు. మంగళవారం మంగయమ్మరావు పేటలోని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా వెంకట్రావు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. తొలుత అంబేద్కర్, పివి.రావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజు హాజరై మాట్లాడారు. వర్గీకరణకు చట్టపరమైన అడ్డంకులు తొలగిస్తామని ప్రధాని మాట ఇవ్వడం అంటే దేశ ప్రధానిగా కులతత్వాన్ని ప్రోత్సహించడమేనన్నారు. అశాస్త్రీయమైన, హేతుబద్ధతలేని ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని ప్రోత్సహించడం అంటే ఎస్‌సిల ఐక్యతను, అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. ఎస్‌సి కులాలను సూక్ష్మ విభజన చేయలేమని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం ముగిసిపోయిన ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని తిరిగి తెరపైకి తీసుకొచ్చి దళితుల ఐక్యతను దెబ్బతీసంతన్నారు. వర్గీకరణకు ఏ పార్టీ మద్దతు ఇచ్చినా రాష్ట్రంలో 11 శాతంగా ఉన్న మాలలు ఆ ఆ పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు ఎం.కృపానందం, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడిన రేషన్ వాహనంపై దర్యాప్తు

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరంలో సోమవారం రాత్రి పోలీసులకు అందిన సమాచారం మేరకు ప్రభుత్వ రేషన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దర్యాప్తు నిమిత్తం పౌరసరఫరాల శాఖకు వాహనాన్ని అప్పగించారు. సీతానగరం ఎంఎస్‌ఒ అచ్యుత కుమారి ఆదేశాలతో గోకవరం ఎంఎస్‌ఒ విచారణ చేపట్టారు. 22 బియ్యం బస్తాలు, కేజీ వంతున 30 గోధుమ పిండి ప్యాకెట్లు, 40 పంచదార ప్యాకెట్లు ఉన్నాయని, అకస్మాత్తుగా బంధువులకు ఆరోగ్యం బాగోలేదని రేషన్ వాహనంతో తంటికొండ నుంచి సీతానగరం వచ్చినట్లు డ్రైవర్ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. స్టాక్ రిజిస్టర్, అమ్ముడైన సరుకులకు లెక్కలు చూస్తున్నామని పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

1250 కేజీల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల వెంకటలక్ష్మి బియ్యం దుకాణంలో ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ తనిఖీ నిర్వహించారు. అమలాపురంలో ఏలేశ్వరపు రాధాకృష్ణ రైస్ గోడౌన్,షాపుల్లోనూ తనిఖీ చేశారు. 1,250 కేజీల అక్రమ రేషన్ బియ్యం గుర్తించారు. సివిఎస్ డిటి మరియు విఆర్‌ఒల సమక్షంలో సీజ్ చేసి అంబాజీపేట స్టాక్ పాయికు తరలించారు. వీరిపై 6ఎ కేసు నమోదు చేశామని తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలం లోని వేంగాయమ్మపురం గ్రామం లో మంగళవారం ట్రాక్టర్ బ్యాటరీ షార్ట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని అగ్ని మాపక అధికారి లక్ష్మణ్ తెలిపారు. చవలం సుబ్బలక్ష్మి కి చెందిన ట్రాక్టర్ ఒక్క సారిగా బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి పాక్షికంగా దగ్ధమైంది అని తెలిపారు. ఈ ప్రమాదం లో రూ. 80వేల నష్టం వాటిల్లినట్టు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ తహశీల్దార్ గౌరీ నాయుడు

కుల గణనపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కచేరి పేటలోని సుందరయ్య భవనంలో తోలుబొమ్మలాట కులస్తులకు సమగ్ర కుల గణనపై అవగాహన సదస్సు జరిగినది. ఈ సదస్సుకు రిటైర్డ్ తహశీల్దార్ కె.గౌరినాయుడు, సామాజిక కార్యకర్త పి.రామకృష్ణ, జెవివి జిల్లా ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రెడ్డి, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అనపర్తి ఏడుకొండలు, అనపర్తి భీమన్న, తోట బాలకష్ణ, తోలుబొమ్మలాట కుల సంఘ నాయకులు, మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి బాలబాలాజీ శాశ్వత నిత్య అన్నదాన ట్రస్ట్ కు మడికి వాసులు ముసునూరి శేష గిరిరావు వెంకట రాజేశ్వరి దంపతులు పెళ్లి రోజు) (ప్రతి ఏటా నవంబర్ -14న) అన్నదానము జరిపించు నిమిత్తం మంగళవారం రూ.25,002 నిత్య అన్నదాన ట్రస్ట్ నకు విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ మరియు ఇఒ జి.మాధవి తెలిపారు ఆలయ ఛైర్మన్ చిట్టూరి రామకష్ణ, ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, అర్చకులు దాత దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

భీమనపల్లిలో సహకార వారోత్సవాలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

భీమనపల్లిలో 70వ అఖిలభారత సహకార వారోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సహకార సొసైటీ కార్యాలయం వద్ద స్థానిక సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సహకార పతాకాన్ని సహకార సంఘం డైరెక్టర్ దేవరపల్లి రామ్ గోపాల్ రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహకార సంఘ సభ్యులు జె.శ్రీనివాసరాజు,వై. నాగేశ్వరరావు, సిఇఒ, పి.దుర్గాప్రసాద్, ఆర్ బి కె సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు పండ్ల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం కొంకాపల్లి లూయీ అంధుల పాఠశాలలో చిన్నారులకు అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు లింగోలు పండు పళ్ళు అందజేశారు. మంగళవారం అంధుల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పండు మాట్లాడుతూ జనసేన పార్టీ తరపున లూయీ అంధుల పాఠశాలకు అన్నివేళలా అందుబాటులో ఉంటామని, విద్యార్థులకు విద్యా పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమకు తెలియజేయాలని పాఠశాల యాజమాన్య సిబ్బంది శ్రీనివాస్ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలిశెట్టి బాబులు, నల్లా వెంకటేశ్వరరావు, కరిముళ్ళ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఫిర్కియాప్‌తో సామర్థ్యం పెంపు

ప్రజాశక్తి-ఆలమూరు

ఫిర్కియాప్‌లో ఉపాధ్యాయులంతా లాగిన్ అయ్యి తమ బోధన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. ఆయన అధ్యక్షతన ఆలమూరు విద్యావనరుల శాఖ కార్యాలయంలో ఎంఇఒ-1 శాలెం రాజు, ఎంఇఒ-2 సుబ్బరాజుల ఆధ్వర్యంలో మంగళవారం పలు మండలాల విద్యాశాఖ అధికారులు-2, సిఆర్‌ఎంటిలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

యానాం వార్తలు

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

నిరుపేద కుటుంబాలకు చెందిన 32 ఎకరాల భూమికి సంబంధించి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉదయం తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, మల్లాడి సత్తిబాబు బాధితులతోకలిసి ఆర్‌ఎఒ మునిస్వామి, సిఐ షణ్ముగంలకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాదితులు మాట్లాడుతూ తప్పుడు డాక్యుమెంట్లను సష్టించి ఒఎన్‌జిసి సంస్థ వద్ద కోట్లాది రూపాయలు డబ్బు తీసుకోవాలనుకున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తమ భూములు మందపాటి బయ్యన్న పశువులకు గడ్డి పెంచుకోవడానికి లీజుకు తీసుకున్నాడన్నారు. అధికారులను మభ్యపెట్టి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. ఆ భూమిని చమురు సంస్థలకు అమ్ముతున్నట్లుగా సమాచారం వచ్చిందన్నారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాడి భీరాస్వామి,జాన్,గణేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు,ప్రైవేటు పాఠశాలలోను మంగళవారం అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిటీ ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక మెట్టకూరు రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

రత్నగిరిపై కార్తీక మాసం ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశామని దేవస్థానం ఇఒ ఆజాద్ తెలిపారు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కార్తీక మాసంలో 2 లక్షల వరకూ వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో కంటే అదనపు మండపాలు టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. దర్శనం క్యూలైన్‌లో 1000 వరకు భక్తులు ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. సుమారు 30 లక్షలు ప్రసాదం ప్యాకెట్లు తయారు చేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. వికలాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తలనీలాలు శాలలను కొండ దిగున, ం హరిహర సాధన వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. చైర్మన్ రోహిత్‌ని సమన్వయం చేసుకుంటూ తమ సిబ్బందిని అప్రమత్తం అయ్యేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎక్కడైనా ఇబ్బంది కలిగిన సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకడేది లేదని స్పష్టం చేశారు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పి సతీష్ కుమార్ అన్నారు. కాట్రవులపల్లి దళిత కాలనీలో గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత గ్రామంలో చిన్నారులతో ఆయన ముచ్చటించారు. పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీసులను సంప్రదించాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 తదితర నెంబర్లకు కాల్ చేయాలన్నారు. ఆయన వెంట డిఎస్‌పి లతా కుమారి, సిఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ నాగార్జున రాజు, సిబ్బంది ఉన్నారు.

'వైసిపికి తగిన బుద్ధి చెప్పాలి'

ప్రజాశక్తి -కరప

రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిశీలకులు కుడిపూడి సత్తిబాబు అన్నారు. గురజనాపల్లిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్, బుంగా సింహాద్రి, గుల్లిపల్లి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు చంద్రశేఖర్ ఎంపిక

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు మూలపేట విద్యార్థి బొడ్డు చంద్రశేఖర్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం ఎం.హరిబాబు తెలిపారు. ఇటీవల పిఠాపురంలో నిర్వహించిన అండర్-19 సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో చంద్రశేఖర్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చంద్రశేఖర్ పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను ఎంపిటిసి సభ్యులు అడ్డాల పాప, లోవ కుమారి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

బాసుదేవ ఆచార్య మృతికి సిఐటియు నివాళి

ప్రజాశక్తి - కాకినాడ

మాజీ ఎంపీ బాసుదేవ ఆచార్య మృతికి సిఐటియు ఘనంగా నివాళులర్పించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బాసుదేవ ఆచార్య తొమ్మిది సార్లు బెంగాల్లో బంకురా నియోజకవర్గం నుంచి ఎంపిగా ఎన్నికయ్యారని తెలిపింది. 2004 నుంచి 2014వరకు సిపిఎం పార్లమెంటరీ పార్టీ నాయకులుగా వ్యవహరించారని పేర్కొంది. విశాఖలో బిహెచ్‌ఇవి ప్రయివేటీకరణ కాకుండా నివారించడంలో ఆయన ముఖ్యభూమిక పోషించారని గుర్తు చేసింది. రైల్వే ఉద్యోగుల నాయకునిగా, కోల్ వర్కర్స్ నాయకులుగానూ, అఖిల భారత ఎస్‌బిఐ ఏజెంట్స్ నాయకునిగానూ, పలు సంఘాలకు ప్రత్యక్షంగా బాధ్యతలు నిర్వహించారని తెలిపింది. ఆయన మృతి తీరని లోటు అని, ఆయన కుటుంబానికి సంతాపం ప్రకటించింది.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో సరైన అవగాహన, అప్రమత్తతతో తీసుకునే చర్యలే తీవ్ర నష్టాలను నివారిస్తాయని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు వైడీ రామారావు అధ్యక్షతన మంగళవారం ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో తీసుకోవలసిన చర్యలపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్‌హెన్రీడ్యూనాల్డ్, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో 12 మంది వికలాంగ విద్యార్థుళకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంఇఒలు ప్రభాకర్ శర్మ, కెవివి.చౌదరి అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసిమంగతాయారు, కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి, సిబ్బంది బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.


డయల్ యువర్ కలెక్టర్‌కు 7 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కాకినాడ

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి ఏడుగురు వివిధ సమ్యలపై ఆమెకు ఫిర్యాదు చేశారు. ఫోను ద్వారా తెలియజేసిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.శ్రీధర్‌రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 84 మంది ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళా లో 84 మంది ఎంపికయ్యారని మంగళ వారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్‌ఎన్. నరసింహ రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వికాస ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించారన్నారు. సుమారు 220 మందిని ఇంటర్వ్యూ చేయగా 84 మందిని ఎంపిక చేశారన్నారు. వీరందరికి వార్షిక వేతనం రూ.2.4లక్షలని, అపాయి మెంట్ ఆర్డర్ అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.మనోహర్, వికాస కో-డైరెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌విలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - తుని

పట్టణంలో ఎస్‌వి జూనియర్, డిగ్రీ కళాశాలలో ఫ్రేషర్స్ డే వేడుకలు విద్యాసంస్థల కరస్పాండెంట్ సిహెచ్‌వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలు, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. చదువులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. కరెస్పాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్‌పి.రాజు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆట స్థలం అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎస్ఎన్ చారిటీస్ ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని చార్టీస్ చైర్మన్ మల్లాడి కార్తీక్‌నాయర్ కోరారు. విద్యార్థులు, పిఎంసిలతో కలిసి ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. గత ఐదేళ్లుగా పాఠశాల, కళాశాల వెళ్లే రహదారి, ఆట స్థలం నీటిలో మునిగి పిల్లలకు ఇబ్బందికరంగా ఉండేదన్నారు. పిఎంసి కోరికపై స్పందించిన ఎంఎల్‌ఎ చంద్రశేఖర్ రెడ్డి రూ.50 లక్షలతో రహదారిని నిర్మించారన్నారు. అలాగే ఎంఎల్‌ఎ కల్పించు కుని ఆటస్థలాన్ని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, గండేపల్లి

గడిచిన పది నెలల్లో 22 శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయని ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అలాగే గండేపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి లోపాలను సరిదిద్దాలని సూచించారు. హైవేలో ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకోవడంతో కొంత వరకూ ప్రమాదాలను


మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్

అరికట్టగలిగామని ఎస్‌పి తెలిపారు. గంజాయి, పశువుల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. త్వరలో గండేపల్లి పోలీస్ స్టేషన్ నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పెద్దాపురం డిఎస్‌పి లతాకుమారి, సిఐ సూర్యఅప్పారావు, ఎస్ఐలు నాగార్జునరాజు, గణేష్‌కుమార్ ఉన్నారు.